ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
మంగళవారం 18 ఫిబ్రవరి 2025



మండలి పోరు.. ప్రచార జోరు

- ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం
- ఉపాధ్యాయుల స్థానంలో 15 మంది, పట్టభద్రుల స్థానంలో 56 మంది పోటీ
- మద్దతు కోసం పార్టీ నేతలు, సంఘాల ద్వారా ప్రచారం
- పట్టభద్రుల ఓట్లు 22,397, ఉపాధ్యాయుల్లో 950
- జిల్లాలో 41 పోలింగ్ కేంద్రాలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో జోరుగా సాగుతోంది. నామినేషన్ల పర్వం ముగిసిపోవడంతో ప్రచార రంగంలోకి వచ్చారు. ఓటర్లను ఆకట్టుకోవ డానికి విస్తృతంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. టీచర్ల ఎమ్మెల్సీ స్థానంలో 15 మంది పట్టభద్రుల స్థానం లో 56 మంది బరిలో నిలిచారు. 27న పోలింగ్ ఉండ డంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారం వేగవంతం చేశారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో ఎన్నికలను ప్రతిష్ఠాత్మ కంగా తీసుకుని ముమ్మరంగా ప్రచారం మొదలు పెట్టారు. సోషల్ మీడియా, ఫోన్‌కాల్స్‌తో ప్రచారం ముమ్మరం చేశారు. ప్రధానంగా కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వి నరేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి చిన్నయి అంజిరెడ్డి, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ, ఆల్‌ఇండియా కిసాన్ జనతా పార్టీ అభ్యర్థి చంద్రశేఖర్, తెలంగాణ ప్రజాశక్తి పార్టీ అభ్యర్థి వెంకటేశం, ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి సర్దార్ రవీందర్‌సింగ్, విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థి బక్క జడ్సన్, ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థి మంద జ్యోతి, తెలంగాణ ద్రవిడ ప్రజల పార్టీ అభ్యర్థి బొల్లి సుభాష్, నేషనల్ నవక్రాంతి పార్టీ అభ్యర్థి చిలువేరి

ఎమ్మెల్సీ ఓటర్ల వివరాలు (పట్టభద్రులు)

మండలం	పురుషులు	స్త్రీలు	మొత్తం
బోయినపల్లి	1,199	608	1,807
చందుర్తి	576	386	962
కోనరావుపేట	963	533	1,496
రుద్రంగి	247	145	392
వేములవాడ	1,977	1,452	3,429
వేములవాడ రూరల్	570	400	970
సిరిసిల్ల	3,056	2061	5,117
ఇల్లంతకుంట	1,214	755	1,969
గంభీరావుపేట	804	422	1,226
ముస్తాబాద్	987	508	1,495
తంగళ్లపల్లి	974	587	1,561
వీర్నపల్లి	333	199	532
ఎల్లారెడ్డిపేట	872	569	1,441
మొత్తం	13,772	8,625	22,397

ఇంద్రాగౌడ్‌లతో పాటు 44 మంది స్వతంత్రులు బరిలో ఉన్నారు. వీరితో పాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య, బీఎస్పీ అభ్యర్థి యాటకారి సాయన్న, దళిత బహుజన పార్టీ అభ్యర్థి గవ్వల లక్ష్మీ, స్వతంత్రులుగా వై అశోక్‌కుమార్, కంటె సాయన్న, కూర రఘోత్తంరెడ్డి, చాలిక చంద్రశేఖర్, జగ్గు మల్లారెడ్డి, తిరుమల్‌రెడ్డి, ఇన్నారెడ్డి, మామిడి సుధాకర్‌రెడ్డి, ముత్తారం

ఎమ్మెల్సీ ఓటర్ల వివరాలు (ఉపాధ్యాయులు)

మండలం	పురుషులు	స్త్రీలు	మొత్తం
బోయినపల్లి	39	07	46
చందుర్తి	24	04	28
కోనరావుపేట	27	08	35
రుద్రంగి	16	02	18
వేములవాడ	113	64	177
వేములవాడ రూరల్	18	09	27
సిరిసిల్ల	170	102	272
ఇల్లంతకుంట	61	16	77
గంభీరావుపేట	51	15	66
ముస్తాబాద్	60	10	70
తంగళ్లపల్లి	23	14	37
వీర్నపల్లి	13	02	15
ఎల్లారెడ్డిపేట	62	20	82
మొత్తం	677	273	950

నర్సింహాస్వామి, వంగ మహేందర్‌రెడ్డి, వేముల విక్రమ్‌రెడ్డి, సిలివేరి శ్రీకాంత్, ఎల్‌సుహాసినిలు పోటీలో ఉండి ప్రచారం ముమ్మరం చేశారు. జిల్లాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకున్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తూ జోరుగా ప్రచారం సాగిస్తున్నారు. గ్రాడ్యుయేట్లను, ఉపాధ్యాయులను ఒక చోటకు..

మిగతా 8లో

కందుల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



తంగళ్లపల్లి మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో తనిఖీ చేస్తున్న కలెక్టర్

సిరిసిల్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కందుల కొనుగోలు కేంద్రాలను ఈ నెల 22న ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో కందుల కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లాలో మొత్తం 1,129 ఎకరాల్లో కందుల సాగు జరిగిందని 6,211 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అన్నారు. ఐకేపీ ద్వారా గంభీరావుపేట, ఇల్లంతకుంట, ముస్తాబాద్, తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట, చందుర్తి మండలాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని మిగతా చోట్ల సింగిల్ విండో కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రతి మండలంలో కొనుగోలు కేంద్రాలు ఎక్కడా ఏర్పాటు చేయాలో అధికారులు నిర్ణయించి రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో, ఐకెపీ కొనుగోలు కేంద్రాల వద్ద కందుల కొనుగోలుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. సమీప గోదాముల్లోకి కందుల తరలింపు కోసం రవాణాకు టెండర్ల ద్వారా అవసరమైన వాహనాలు అందుబాటులో పెట్టాలని అన్నారు. గన్నీ బ్యాగులు, వేయింగ్ యంత్రాలు, తేమ యంత్రాలు, టార్పాలిన్లు ఇతర సౌకర్యాలు ఉండేలా చర్యలు చేపట్టాలని అన్నారు. కనీస మద్దతు ధర పంట నాణ్యత పరిశీలన 12 తేమ శాతం, ఇతర నాణ్యత ప్రమాణాలపై అధికారులకు అవసరమైన శిక్షణ మంగళవారం అందించాలని అన్నారు. 22న కేంద్రాలు ప్రారంభించాలని అన్నారు. 12 శాతం తేమలోపు ఉన్న కందులకు క్వింటాలుకు రూ.7550 మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. సమావేశంలో జిల్లా మార్క్‌ఫెడ్ అధికారి హబీబ్, మార్కెటింగ్ అధికారి ప్రకాష్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ భేగం, డీఆర్‌డీవో శేషాద్రి, డీసీవో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలి

తంగళ్లపల్లి : నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ప్రతి రోజూ కామన్ డైట్ మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. తంగళ్లపల్లిలోని సిరిసిల్ల మైనార్టీ సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాలయాన్ని సోమవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గదిలోని బియ్యం, కూరగాయలు, పండ్లు, కోడి గుడ్లు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ఆర్‌ఓ ప్లాంట్ నీటిని తాగి నాణ్యతను పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు మేరకే ఆహార పదార్థాలు, పండ్లు, కూరగాయలు, కోడి గుడ్లు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పబ్లిక్ పరీక్షల దృష్ట్యా విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధపెట్టి నిత్యం చదివించాలని ఆదేశించారు. ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రూసా ఫాతిమా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మినీ స్టేడియం షట్టర్ల అద్దెకు దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్ర జ్యోతి) : సిరిసిల్ల పట్టణం మినీ స్టేడియం నందుగల షట్టర్లు అద్దెకు ఇవ్వనున్నట్లు సోమవారం జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి అజ్మీరా రాందాస్ తెలిపారు. ఆసక్తిగల వ్యాపారులు, ప్రజలు అద్దెకు తీసుకోవాలని అనుకుంటే ఈ నెల 18 నుంచి 24 వరకు జిల్లా యువజన క్రీడాశాఖ కార్యాలయంలో, లేదంటే మినీ స్టేడియం కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఇంటర్నల్ మార్కుల పరిశీలన

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దలింగాపూర్, వెల్జీపూర్ గ్రామాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం పదవతరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులను పరిశీలించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దూస గోవర్దన్, తూముకుంట నరేందర్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బోయిని తిరుపతి పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కుంగ్‌ఫూలో పతకాలు సాధించడంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. గోల్డ్‌మెడల్ సాధించిన రసన్య, సిల్వర్ మెడల్ సాధించిన వర్షిత, మౌనిక కాంస్య పతకం సాధించిన తేజస్వినిలతో పాటు ట్రైనర్ పెద్ది రాజులకు సోమవారం ఓ కార్యక్రమంలో అభినందనలు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు

- నేర సమీక్షలో ఎస్పీ అఖిల్ మహాజన్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వేములవాడ సబ్‌డివిజన్ పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్న వారిపై నిఘా పెంచాలన్నారు. గంజాయి కిట్లతో నిరంతరం తనిఖీలు నిర్వహించాలన్నారు. ఇళ్లకు అలారం లాక్‌లు, సెన్సార్‌లను బిగించుకుంటే దొంగతనాలతో పాటు ఇతర నేరాల నియంత్రణ సులభమవుతుందన్నారు. అటవీ జంతువులను వేటాడే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలన్నారు. కులపంచాయతీల పేరిట బహిష్కరణకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసులు నమోదుచేయాలన్నారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌ల వారీగా నమోదైన కేసులు ఇతర అంశాలపై అధికారులకు ఎస్పీ పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్, రూరల్ సీఐ శ్రీనివాస్, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు మారుతి, అశోక్, ప్రశాంత్‌రెడ్డి, పృథ్వీందర్‌గౌడ్, ప్రేమానందం, ఐటి కోర్ ఎస్ఐ కిరణ్, డిసిఆర్‌బి ఎస్ఐ జ్యోతి పాల్గొన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు



బహుమతులు అందజేస్తున్న అధికారులు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాలిపెల్లి గ్రామంలో జరుగుతున్న జిల్లాస్థాయి సబ్‌జూనియర్స్ కబడ్డీ పోటీలు ముగిసాయి. పోటీలలో 26 బాలుర, 18బాలికల జట్లు పాల్గొన్నాయి. బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో బోయినిపల్లి, ద్వితీయ స్థానంలో ఇల్లంతకుంట, బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో రహీంఖాన్‌పేట గ్రామ ఆదర్శ పాఠశాల, ద్వితీయ స్థానంలో సిరిసిల్ల జట్లు నిలువగా విజేతలకు రాఘవేంద్ర ఆసుపత్రి డాక్టర్ గాజర్ల శరత్‌కుమార్, తుమ్మిడిశెట్టి వెంకటేశ్వర్‌రావు, ఎఫ్‌టీఐ సంస్థ బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఈతరం యువజన సంఘ అధ్యక్షుడు నరేష్, కార్యదర్శి చింటు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, కార్యదర్శి సింగారపు తిరుపతి, కబడ్డీ అసోసియేషన్ బాధ్యులు సంపత్‌రావు, దేవత ప్రభాకర్, మల్లేష్‌గౌడ్, అనీల్‌గౌడ్, డేవిడ్సన్, మామిడి శ్రీనివాస్, బొడ్డు నారాయణ, మదన్, సాన బాబు, రవీందర్‌రావు, సంతోష్, ప్రభాకర్, నరేష్‌లతో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

కెనాల్ పనులు పూర్తిచేసి రైతులను ఆదుకోవాలి



కలెక్టరేట్ వద్ద నాలుగు గ్రామాల రైతులు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కెనాల్ పనులు పూర్తిచేసి రైతులను ఆదుకోవాలని సోమవారం కలెక్టర్‌కు విన్నవించినట్లు ఇల్లంతకుంట మండలంలోని నాలుగు గ్రామాల రైతులు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని 11వ ప్యాకేజీలో భాగంగా రంగనాయకసాగర్ ద్వారా వచ్చే నీటి కోసం తవ్విన కెనాల్ పనులు మధ్యలోనే నిలిచిపోయాయని పేర్కొన్నారు. కెనాల్ నిర్మాణం పూర్తి అయితే పెద్దలింగాపూర్, చిక్కుడువానిపల్లె, రామోజీపేట, వెల్జీపూర్ గ్రామాలలోని దాదాపు 300 ఎకరాలకు నీటి సౌకర్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు దేశెట్టి శ్రీనివాస్, అమ్ముల అశోక్‌యాదవ్, మధుసూదన్, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

కేజ్ కల్చర్ ఏర్పాటును నిలిపివేయాలి



కలెక్టరేట్‌కు తరలివచ్చిన ముదిరాజ్ సంఘ నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం చీర్లవంచ శివారులో మిడ్ మానేరు డ్యాంలో కేజ్ కల్చర్ ఏర్పాటును నిలిపివేయాలని జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చొక్కాల రాము, మత్స్యశాఖ జిల్లా అధ్యక్షుడు చొప్పరి రామచంద్రం డిమాండ్ చేశారు. జిల్లా ముదిరాజ్ నాయకులు, మత్స్యకారులు సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చి కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝాతోపాటు జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్యకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పండుగ రాజు, భీమరి దేవయ్య, గంగు శివకృష్ణ, యామ తిరుపతి తదితరులు ఉన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

- జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి పెంచలయ్య



ఎల్లారెడ్డిపేట ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న పెంచలయ్య

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది 24 గంటల పాటు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి పెంచలయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేశారు. కేంద్రంలోని రికార్డులు, మందుల నిల్వ, పరిసరాలు, ప్రగతి పనులను పరిశీలించారు. సాధారణ ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ప్రదీప్, వైద్యులు బాబు, ఓంకార్ తదితరులు ఉన్నారు.

గంభీరావుపేట: కమ్యూనిటీ జిల్లా ఆసుపత్రి హెల్త్ సెంటర్‌ను జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి డాక్టర్ పెంచలయ్య సోమవారం సందర్శించారు. హాస్పిటల్‌లో ప్రసవాలు ఇంకా పెంచాలని, ఆసుపత్రి స్టాఫ్ పనితీరు బాగుందని ఇంకా ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సృజన్ శ్రీవాత్సవ్, ఆర్ఎంఓ డాక్టర్ సింధూజ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీల లోపాయికారి ఒప్పందాలు



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీలో లేకుండా బీజేపీతో బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందాలు చేసుకున్నారని, బీఆర్ఎస్, బీజేపీ వ్యవహార శైలి గల్లీలో లొల్లి, ఢిల్లీలో దోస్తీ అన్న విధంగా ఉందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కే కన్వెన్షన్ హాల్‌లో మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సంద ర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా సిరిసిల్ల నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జి ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాల్లో ఇచ్చిన ఉద్యోగాలను ప్రజాప్రభుత్వం పది నెలల్లోనే ఇచ్చిందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చినా ఉద్యోగులకు ప్రతి నెలా మొదటి తేదీన జీతాలు ఇస్తున్నట్లు తెలిపారు. అనాడు రాష్ట్రపతి ఎన్నికల్లో, నల్లచట్టాల అమలు సమయంలో బీఆర్ఎస్, బీజేపీకి మద్ధతు ఇచ్చిందని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ నాయ కులందరూ కష్టపడితే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉపయోగ పడుతాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు అందరికీ వివరించాలని అన్నారు. బీఆర్ఎస్ క్షేత్ర స్థాయిలో బలహీనపడిందని అందుకే పోటీలో లేదన్నారు. గత ప్రభుత్వహ యాంలో సిరిసిల్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులపై అనేక అక్రమ కేసులు పెట్టారని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో బీఆర్ఎస్ నాయకులపై ఒక్క కేసు కూడా నమోదు కాలేదని అన్నారు. కేటీఆర్ సిరిసిల్లకు వస్తే నేరేళ్లలో ముళ్ల కంచెలు వేసేవారని అన్నారు. ప్రజాప్రభుత్వంలో ప్రజలు స్వేచ్ఛగా వచ్చి తమ సమస్యలు చెప్పుకుంటున్నారని అన్నారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 50 మంది ఓటర్లకు ఒక ఇంచార్జిని నియమించడం జరుగుతుందని అన్నారు. సిరిసిల్లలో షాడో సీఎంగా కేటీఆర్ ఉన్న సమ యంలో కేసులు పెట్టినా కాంగ్రెస్ కార్యకర్తలు కష్టపడి పనిచేశారని అనాడు జీవన్‌రెడ్డిని గెలిపించుకున్నామని గుర్తు చేశారు. సిరిసిల్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించుకోవాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, పీసీసీ సభ్యులు సంగీతం శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, మార్కెట్ కమిటీ చైర్మన్లు స్వరూపరెడ్డి, రాము, విజయలక్ష్మీ, రాములు నాయక్, సబేరాబేగం, పార్లమెంట్ కో కన్వీనర్ చక్రధర్ రెడ్డి, కాంగ్రెస్ మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

CHANGE OF SURNAME

★ I GUMLAPURAM RAJESH S/O RAJANNA H.NO. 8-203, VARSHAKONDA VILLAGE, IBRAHIMPATNAM MANDAL, JAGITHYAL DIST. NOW I CHANGED MY SURNAME AS JANGITI RAJESH RAJANNA.

AJK-16531

CHANGE OF NAME

★ I GUMLAPURAM MUTTAMMA W/O. RAJANNA, H.NO. 8-120, VARSHAKONDA VILLAGE, IBRAHIMPATNAM MANDAL, JAGITHYAL DIST. NOW I CHANGED MY NAME AS JANGITI MUTTU W/O. RAJANNA.

AJK-16531

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా సమ్మిందబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి

కరీంనగర్ :- సెల్: 9703618691, 9985410640

జగిత్యాల, మెట్‌పల్లి :- సెల్ : 9985411262

వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 9985411063

పెద్దపల్లి :- 9550900238

రోడ్డు ప్రమాదంలో డిగ్రీ విద్యార్థి దుర్మరణం


మణివర్ధన్ (ఫైల్)

మానకొండూర్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ డిగ్రీ విద్యార్థి దుర్మరణం చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మానకొండూర్‌కు చెందిన రామంచ పద్మ-కిషన్‌లకు కుమారుడు మణివర్ధన్, కుమార్తె వైష్ణవి ఉన్నారు. రామంచ మణివర్ధన్(18) హన్మకొండలోని కాకతీయ యూనివర్సిటీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం తన స్నేహితుడితో రోడ్డుపక్కన నడుచుకుంటూ ఇంటికి వస్తున్నాడు. అదే సమయంలో అన్నారం నుంచి కరీంనగర్ వైపు వెళుతున్న ఏపీ15 ఏపీ 0854నంబర్ గల మోటార్ సైకిల్ మణివర్ధన్‌ను వెనకాల నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో మణివర్ధన్‌కు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం 108లో కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని హైదరాబాద్‌కి తీసుకెళ్లలని సూచించారు. అర్ధరాత్రి కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తీసుకెళుతుండగా సోమవారం తెల్లవారుజామున మార్గమధ్యలో మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి. విద్యార్థి మృతికి కారణమైన మోటార్ సైకిలిస్టుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

మద్యం మానేయాలని మందలిస్తే.. ప్రాణం తీసుకున్నాడు

● దినసరి కూలీ బలవన్మరణం


కనుకయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మద్యం మానేయాలని మందలిస్తే ఓ దినసరి కూలీ ప్రాణాన్నే బలి తీసుకున్నాడు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌కు చెందిన దినసరి కూలీ హనుమ కనుకయ్య(40) సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని కనుకయ్య దినసరి కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. నిత్యం కూలి చేసినా పూట గడవడం గగనంగా మారింది. దాంతో మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగి తరుచూ గొడవకు దిగుతుండడంతో కుటుంబ సభ్యులు మానేయాలని మందలించారు. దాంతో మనస్తాపం చెందిన కనుకయ్య ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని విగత జీవిగా కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు. మృతుడికి భార్య లక్ష్మి, వివాహమైన కూతురు లక్ష్మి, శ్రీలత, కొడుకు నవీన్ ఉన్నారు.

బాలుడి అనుమానాస్పద మృతి


ప్రవీణ్ (ఫైల్)

కథలాపూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం చింతకుంటలో మంతెన ప్రవీణ్(17) అనే బాలుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం ప్రవీణ్ పదవ తరగతిలో అర్ధాంతరంగా చదువు మానేశాడు. సోమవారం ప్రవీణ్ తల్లి వ్యవసాయపనులకు వెళ్ళి సాయంత్రం ఇంటికి తిరిగిరాగా కొడుకు దూలానికి ఉరివేసుకొని కనిపించాడు. కాగా తన కొడుకు మృతిపై అనుమానం ఉందని తల్లి మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి పంపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెట్టు పై నుంచి పడి ఒకరు..

ఎండపల్లి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఎండపల్లి మండలం శానబండ గ్రామంలో చింతకాయలు దులపడానికి కూలికి వచ్చి చెట్టు పైనుంచి పడి కడారి పెద్దలచ్చయ్య(48) అనే వ్యక్తిప్రాణాలు కోల్పోయాడు. గ్రామస్థులకథనం మేరకు శానబండ గ్రామానికి చెందిన కడారి పెద్దలచ్చయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవించేవాడు. ఆదివారం వెల్గటూర్ మండలం చెగ్యాం గ్రామానికి చెందిన ఉప్పు బాపన్న అనేవ్యక్తికి చింతచెట్టు ఎక్కి చింతకాయలు తెంపడానికి కూలికి వెళ్లాడు. చింతకాయలు కొడుతుండగా కాలు జారి చెట్టు పై నుంచి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్సపొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ వివాహిత..

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జమ్మికుంటకు చెందిన గుర్రాల స్వర్ణలత(35) వివాహిత చికిత్సపొందుతూ సోమవారం మృత్యువాతపడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలం మొలంగూర్‌కు చెందిన స్వర్ణలతకు వీణవంక మండలం బొంతుపల్లికి చెందిన గుర్రాల ప్రభాకర్‌తో 15సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రభాకర్ సీడ్‌వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. సీడ్ వ్యాపారంలో ప్రభాకర్‌కు నష్టం వాటిల్లగా, స్వర్ణలత తీవ్ర మనస్థాపానికి గురై ఈనెల 16న పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. మెరుగైనచికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎమ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మృత్యువాత పడింది. మృతురాలి తల్లి వజ్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

కాలువలో దూకి వివాహిత ఆత్మహత్యాయత్నం

తిమ్మాపూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్ శివారులోని కాకతీయకాలువలో దూకి ఓ వివాహిత ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. స్థానికులు, ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని శ్రీనగర్‌కాలనీకి చెందిన పెద్దాపురంశ్రావణి(30) సోమవారం సాయంత్రం ఆత్మహత్య చేసుకునేందుకు కాకతీయ కాలువలో దూకింది. రాజీవ్ రహదారిపై వెలుతున్న పలువురు గమనించి ఆమెను ప్రాణాలతో బయటకు తీశారు. దాదాపు 500మీటర్ల వరకు ఆమె నీటిలో కొట్టుకుపోయింది. ఎల్ఎండీ పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి వెంటనే మహిళను చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని అసుపత్రికి తరలించారు. ప్రస్తుతం మహిళ ప్రాణాపాయ లేదన్నారు. ఆర్థిక సమస్యలు, ఇంట్లో గొడవల కారణంగా ఆమె ఆత్మహత్మకు పాల్పడినట్లు తెలిసింది.

గోదావరిలో దూకి మహిళ..

ఫైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం ముస్త్యాలకు చెందిన లక్ష్మి సోమవారం గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు యత్నించింది. బ్రిడ్జి మీద నుంచి నదిలో దూకగా నీరు లేకపోవడంతో ఇసుక కుప్పల్లో పడి గాయపడింది. తీవ్రంగా గాయడిన సదరు మహిళను పోలీసులు గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు.

కొలనూర్‌లో భవనం దగ్ధం

ఓదెల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొలనూర్‌లో సోమవారం మాటూరి స్వర్ణలత అనే మహిళకు చెందిన భవనం మంటలు అంటుకొని దగ్ధమైంది. దీనిపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ఇంటిలోని ఎలక్ట్రానిక్ సామగ్రి, ఫర్నీచర్, బియ్యం, వస్తుసామగ్రి కాలిపోయింది.

సేవే పరమావధిగా..

● ఆపదలో ఉన్న వారికి రక్తదానం ● నిరుపేదలకు ఆహారం పంపిణీ ● సేవాదళ్ యూత్ సభ్యుల ఆదర్శం


పేదలకు ఆహార పదార్థాలు అందజేస్తున్న సేవాదళ్ యూత్ సభ్యులు

కోరుట్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల ఆకలి తీరుస్తూ ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేస్తూ పలు సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలుస్తున్నారు సేవాదళ్ యూత్ సభ్యులు. కోరుట్లలో 12 సంవత్సరాల క్రితం పుప్పాల నాగరాజు అనే యువకుడు సమాజ సేవే లక్ష్యంగా పది మంది సభ్యులతో సేవాదళ్ యూత్‌ను ఏర్పాటు చేశాడు. ప్రస్తుతం 30 మంది సభ్యులు కలిసి ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేస్తూ తమ స్నేహితులను కూడా అందులో భాగస్వాములను చేస్తున్నారు.

ఆరు సంవత్సరాల క్రితం సేవాదళ్ యూత్ అధ్యక్షుడు పుప్పాల నాగరాజు తన సభ్యులతో కలిసి పట్టణంలోని ఓ శుభ కార్యానికి వెళ్లాడు. ఆ ఫంక్షన్‌కు అనుకున్న స్థాయిలో అతిథులు రాకపోవడంతో వండిన వంటలు చాలా వరకు మిగిలిపోగా పడేశారు. అది గమనించిన సేవాదళ్ సభ్యులకు మంచి ఆలోచన తట్టింది. కడుపు నిండని నిరుపేదలను గుర్తించి శుభకార్యాలలో మిగిలిన ఆహార పదార్థాలు అందించి వారి కడుపు నింపాలని నిర్ణయించుకున్నారు. అప్పటి నుంచి ఏ ఫంక్షల్‌లోనైనా ఆహార పదార్థాలు మిగిలితే తమకు సమాచారం ఇవ్వాలని కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలతో పాటు కథలాపూర్, మేడిపల్లి, రుద్రంగి మండలాల్లో యూత్ సభ్యులంతా ప్రచారం చేశారు. దీంతో చాలా మంది స్పందించి శుభకార్యాల్లో మిగిలిన ఆహార పదార్థాలను వీరికి అందజేస్తున్నారు. సేవాదళ్ యూత్ సభ్యులు ఆహారాన్ని యాచకులతో పాటు పట్టణ శివార్లలో గుడారాలు వేసుకొని నివాసం ఉన్న వారికి అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.




రక్తదానం చేస్తున్న సభ్యుడు

1700 మందికి రక్తదానం

సేవాదల్ సభ్యులు ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి వారికి అండగా నిలుస్తున్నారు. కోరుట్లతో పాటు జగిత్యాల, మెట్‌పల్లిలోని ఆసుపత్రుల్లో సేవాదళ్ సభ్యుల బ్లెడ్ గ్రూప్ వివరాలు, ఫోన్ నంబర్లను అందిస్తున్నారు. సంస్థ అధ్యక్షుడు పుప్పల నాగరాజు సభ్యులతో పాటు వివిధ ఆసుపత్రుల నంబర్లతో కూడి న వాట్సప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసి సేవలను విస్తరింపజేశారు. ఇప్పటి వరకు సేవాదళ్ యూత్ ఆధ్వర్యంలో 1700 మందికి రక్తదానం చేసినట్లు సభ్యులు తెలిపారు. వివిధ గ్రామాల్లోని రక్త నమూనా సేకరణ శిబిరాలను నిర్వహించి షుగర్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. మధుమేహ బాధితులను గుర్తించి తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు.

పేదల కడుపు నింపడమే లక్ష్యం



పుప్పాల నాగరాజు, సేవాదళ్ యూత్ అధ్యక్షుడు, కోరుట్ల

నిరు పేదల కడుపు నింపడమే లక్ష్యంగా సేవాదళ్ యూత్ ఆధ్వర్యంలో పనిచేస్తున్నాం. శుభకార్యాల్లో మిగిలిన ఆహార పదార్థాలు వృథా కాకుండా సేవాదళ్ సభ్యుల సహకారంతో పేదలకు అందజేస్తున్నాం. నిరు పేదలకు సేవ చేస్తుంటే సంతృప్తిగా ఉంది.

ఆపదలో ఉంటే తక్షణమే స్పందిస్తాం

వ్యాగారపు అభిషేక్, ఉపాధ్యక్షుడు



యూత్ సభ్యులతో కలిసి రక్తదానంతో పాటు భోజన వితరణ చేస్తున్నాం. ఆపదలో ఉన్న వారికి రక్తం అవసరం ఉందని తెలిసిన వెంటనే సభ్యుల సహకారంతో తక్షణమే స్పందిస్తున్నాం. రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటున్నాం.

గంజాయి కేసులో ముగ్గురి అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామ శివారులో గంజాయితో పట్టుబడిన ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని అడవిపదిర, సీతారాంనాయక్‌తండా గ్రామాలకు చెందిన యువకులు మాలోతు దినేశ్, భూక్య హరీష్, అజ్మీరా పవన్‌ల వద్ద నుంచి 110 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనపర్చుకుని నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎల్లారెడ్డిపేట ఇన్‌చార్జి సీఐ మొగిలి సోమవారం తెలిపారు. అరెస్టుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామ శివారులో ఈ నెల 16న ఎస్ఐ ఎల్లాగౌడ్ ఆధ్వర్యంలోని పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా యువకులు దినేశ్, హరీష్, పవన్‌లు అనుమానస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించడంతో గంజాయి సేవించేందుకు కొనుగోలు చేశామని అంగీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దినేశ్, హరీష్, పవన్‌ల వద్ద నుంచి 110 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీన పర్చుకుని రిమాండ్‌కు తరలించామని వెల్లడించారు. గంజాయిని క్రయవిక్రయాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని ఇన్‌చార్జి సీఐ మొగిలి హెచ్చరించారు. గంజాయి రవాణాపై తమకు సమాచారం అందిస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై దృష్టి సారించాలని ఇన్‌చార్జి సీఐ మొగిలి కోరారు.

రాగి తీగ చోరీ

పాలకుర్తి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని పుట్నూర్ గ్రామ శివారు ప్రాంతంలోని కండిగుట్ట రోడ్డు సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి రాగి తీగను దొంగిలించారు. సోమవారం విద్యుత్‌శాఖ అధికారులు పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

రైతులను మోసగించిన ముగ్గురి అరెస్ట్

● సబ్సిడీ ట్రాక్టర్లు ఇప్పిస్తామని రూ.36లక్షలు వసూలు ● రిమాండ్‌కు తరలింపు ● జగిత్యాల డీఎస్పీ రఘుచందర్


పెగడపల్లిలో అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్

పెగడపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అమాయకపు రైతులకు సబ్సిడీద్వారా ట్రాక్టర్లు ఇప్పిస్తామంటూ లక్షలు కాజేసిన ముఠాను పెగడపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం పెగడపల్లి పోలీస్ స్టేషన్‌లో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలకు చెందిన చంద్రమౌళి, పెగడపల్లి మండలంలోని బతికెపల్లి గ్రామానికి చెందిన మల్లేశం, చింతకింది కిషోర్ అనే ముగ్గురు కలిసి నాప్స్ అనేసంస్థ ద్వారా 40శాతం సబ్సిడీద్వారా ట్రాక్టర్లు ఇప్పిస్తామంటూ మండలంలోని బతికెపల్లి, నందగిరి గ్రామాలకు చెందిన అమాయకపు రైతుల నుంచి రూ.36లక్షలు వసూలు చేశారు. అందులో నుంచి గంగాధరలోని శ్రీవెంకటసాయి ఎంటర్‌ప్రైజెస్ జాన్ డియర్ ట్రాక్టర్ షోరూం వారికి రూ.10లక్షలు చెల్లించారు. షోరూం ప్రోద్భలంతో అమాయకపు రైతుల నుంచి సబ్సిడీ కోసమని సంతకాలు తీసుకుని ఈఎంఐ కట్టుకునే విధంగా లోన్‌సౌకర్యం కల్పించి ఆరుగురికి ట్రాక్టర్లు ఇప్పించారు. మిగతా రూ.26 లక్షలు ముగ్గురు తలాకొంత పంచుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్లు తీసుకున్న రైతులను ఫైనాన్స్ వారు కిస్తీలు చెల్లించాలంటూ ఇంటికి వచ్చేసరికి తాము మోసపోయిన విషయం తెలుసుకుని పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు మల్యాల సీఐ నీలం రవి, పెగడపల్లి ఎస్ఐ సీహెచ్ రవికిరణ్ విచారణ జరిపి అమాయకపు రైతులను మోసగించిన ముగ్గురు వ్యక్తులు మన్నెమల్లేశం, చింతకిందికిషోర్, కామెర చంద్రమౌళిని సోమవారం అరెస్టుచేసి జగిత్యాల కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఇదే కామెర చంద్రమౌళికి చెందిన నాప్స్ అనే ప్రైవేట్‌సంస్థపై మంచిర్యాలలో చాలా మంది రైతులను ఇదే విధంగా మోసం చేసినందుకు గత సంవత్సరం నవంబరు నెలలో మంచిర్యాలస్టేషన్‌లో సైతం కేసులు నమోదైనట్లు తెలిసిందన్నారు. పెగడపల్లి మండలంలో కూడా అమాయకపు రైతులకు ట్రాక్టర్లు ఇప్పించినట్లు, వారిని మోసగించుటలో సహకరించిన శ్రీవెంకటసాయి ఎంటర్‌ప్రైజెస్ జాన్ డియర్ ట్రాక్టర్‌షోరూం వారిపై కూడా దర్యాప్తు జరుపుతున్నట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. సమావేశంలో మల్యాల సీఐ నీలం రవి, పెగడపల్లి ఎస్ఐ సీహెచ్ రవికిరణ్ ఉన్నారు.

తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యం

● పగలు సంచారం.. రాత్రి దోపిడీ ● ఇద్దరు దొంగలను పట్టుకున్న పోలీసులు


దొంగలను అరెస్ట్ చూపిస్తున్న ఎస్సై మల్లేష్

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తాళంవేసి ఉన్న ఇండ్లను టార్గెట్‌చేస్తూ దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను సోమవారం పోలీసులు అరెస్టుచేశారు. విలేకరుల సమావేశం ఏర్పాటు వివరాలు వెల్లడించారు. పెద్దపల్లి బస్టాండ్ ప్రాంతంలో ఉండే ఎండీ గౌస్ పాష, కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామానికి చెందిన మేకల లాలూయాదవ్ తాళంవేసి ఉన్న ఇండ్లను పగటివేళల్లో గుర్తిస్తూ రాత్రి దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. చికురాయి గ్రామానికి చెందిన పోచమ్మ ఇంట్లో గత ఏడాది ఏప్రిల్ 17న తాళం పగుల గొట్టి రెండున్నర బంగారు ఆభరణాలు, నగదు దోచుకెళ్ళారు వాటి విలువ సుమారు రెండులక్షల వరకు ఉంటుంద న్నారు. పెద్దపల్లి రైల్వే కాలనీకి చెందిన ఎనగందుల రమాదేవి ఇంట్లో బంగారు, వెండి ఆభరణాలు, స్మార్ట్‌వాచ్, ఐదుసెల్‌ఫోన్లు దోచుకెళ్ళారు సుమారు ఆరులక్షల విలువ ఉంటుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో దొంగలను పట్టుకున్నట్లు తెలిపారు. గౌస్‌పాషవద్ద నుంచి 15 గ్రాముల నక్లెస్, 5గ్రాముల బంగారం, తులం బంగారు చైన్‌ను, అలాగే లాలూ వద్ద 10 గ్రాముల బంగారు చైను స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు. ఇరువుని కోర్టులో హాజరు పర్చనున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు శిక్ష

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో ఒకరికి 45రోజుల జైలుశిక్షతోపాటు రూ.500 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధానన్యాయమూర్తి నీలిమ సోమవారం తీర్పు నిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన అలిశెట్టి బాల కృష్ణ(30) అనేవ్యక్తి 2019లో ఓబాలికపట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. అదేరోజు బాధిత బాలిక కుటుంబసభ్యులు రూరల్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. కోర్టుడ్యూటి అధికారులు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేసు వాదించారు. నేరం రుజువుకావడంతో ముద్దాయికి జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలు వరించారు.

ఒకరిపై హత్యాయత్నం కేసు నమోదు

మానకొండూర్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కొడవలితో దాడికి పాల్పడ్డ ఓ వ్యక్తిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన బత్తిని సాగర్, గోపగాని రవికి కొంతకాలంగా పొలాలకు వెళ్లే దారి విషయంలో గొడవలు జరుగుతున్నట్లు తెలిపారు. సోమవారం సాయంత్రం దారి విషయంలో గొడవపడగా సాగర్‌పై రవి కొడవలితో దాడికి పాల్పడ్డట్లు తెలిపారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడ్డ సాగర్‌ను కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రవిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

గుండెపోటుతో గర్భిణీ మృతి

మల్యాల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం నూకపల్లికి చెందిన చెవులమద్ది స్రవంతి(30) అనే గర్భిణీ గుండెపోటుతో సోమవారం మృతిచెందింది. స్రవంతికి కొడుకు, కూతురు ఉండగా ప్రస్తుతం ఎనిమిది నెలల గర్భిణీ. ఆదివారం పరీక్షల కోసం జగిత్యాలలోని ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లగా రక్తం అవసరమని, గుండె బలహీనంగా ఉందని వైద్యులు తెలిపారు. దీంతో కుటుంబసభ్యులు రక్తం కోసం ఏర్పాట్లు చేస్తుండగా వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని కరీంనగర్ తీసుకెళ్లాలని సూచించారు. దీంతో హుటాహుటిన కరీంనగర్‌లోని మరో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే గుండె బలహీనంగా ఉండడంతో స్రవంతికి చికిత్స అందిస్తే ప్రాణాపాయం అని అక్కడి వైద్యులు తెలిపారు. కాగా సోమవారం ఉదయం ఆమె కడుపులోని శిశువు మృతి చెందడంతో శస్త్రచికిత్స చేసి తొలగించిన కాసేపటికే స్రవంతి కూడా మృతి చెందింది. మృతదేహాన్ని నూకపల్లికి తీసుకురాగా మంగళవారం అంత్యక్రియలు నిర్వహించ నున్నారు.

తప్పుడు ధ్రువపత్రాలతో ఆస్తి కాజేసిన ఇద్దరి అరెస్ట్


నిందితులను కోర్టుకు తరలిస్తున్న సీఐ బిల్ల కోటేశ్వర్

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తప్పుడు ధ్రువపత్రాలుసృష్టించి తండ్రి సంపాదించిన ఆస్తిని కాజేసిన ఘటనలో ఆరుగురిపై కరీంనగర్ ఒకటోఠాణా పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రధాన నిందితులు ఇద్దరిని సోమవారం అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ వ్యవహారంలో నిందితుడికి సహకరించిన రెవెన్యూ అధికారులపై కూడా కేసు నమోదైంది. వన్‌టౌన్‌సీఐ బిల్ల కోటేశ్వర్ వివరాల ప్రకారం.. హైదరాబాద్ మాసాబ్ ట్యాంక్‌కుచెందిన జోరేపల్లి కృష్ణకుమారి (77) భర్త సుబ్బారెడ్డి(మరణించాడు) దంపతులకు కొడుకు జోరేపల్లి ప్రదీప్‌రెడ్డి(51), కూతురు సుచరిత (53) ఉన్నారు. కృష్ణకుమారి భర్త సుబ్బారెడ్డి కరీంనగర్‌లో గ్రానైట్, ఇతర వ్యాపారాలు చేస్తూ వచ్చిన ఆదాయంతో కరీంనగర్ చుట్టుపక్కల పలుచోట్ల భూములు కొనుగోలుచేశాడు. 2014లో అనారోగ్యం కారణంగా సుబ్బారెడ్డి మరణించాడు. హైదరాబాద్ అడ్రస్ ద్వారా భర్తసుబ్బారెడ్డి మరణధ్రువీకరణ పత్రాన్ని కృష్ణకుమారి తీసుకుంది. తరువాత కొంతకాలానికి బాధితురాలి కుమారుడు జోరేపల్లి ప్రదీప్‌రెడ్డి తన తండ్రి సంపాదించిన ఆస్తిని సోదరికి ఇవ్వకుండా ఒక్కడే కాజేయాలని పథకం రచించాడు. ఈ మేరకు ఒక రోజు ప్రదీప్‌రెడ్డి తన తల్లిఇంటికివచ్చి ఇంట్లో ఐటీదాడులు జరగబోతున్నాయని, ఆస్తులకు సంబంధించిన పత్రాలు, తండ్రి మరణ ధ్రువీకరణ, ఫ్యామిలీధ్రువపత్రాలు వెంట తీసుకువెళ్లాడు. వాటిని ఆధారంగా చేసుకుని కరీంనగర్, కరీంనగర్ చుట్టుపక్కల తండ్రి సంపాదించిన ఆస్తులను తన సోదరికి, తల్లికి చెందకుండా కాజేయాలని దురుద్దేశంతో కరీంనగర్‌లోని చైతన్యపురికి చెందిన ఇంటి నంబరు 2-10-1760పేరిట తప్పుడు చిరునామాలో నివాసం ఉంటునట్లుగా పత్రాలను సృష్టించాడు. ఫ్యామిలీ ధ్రువపత్రము నుంచి అమెరికాలో ఉంటున్న తన సోదరి సుచరితపేరు తొలగించి మరోధ్రువీకరణ పత్రం సృష్టించాడు. వాటిని ఉపయోగించి సుల్తానాబాద్ లోని 2ఎకరాల 11గుంటల భూమిని కాజేశాడు. తండ్రి పేరిట ఉన్న గ్రానైట్‌క్వారీ లీజు యాజమాన్యపు హక్కులు పొందాడు. ఈవిషయం ఆలస్యంగా తెలుసుకున్న కృష్ణకుమారి కరీంనగర్ పోలీసులను ఆశ్రయించింది. వన్‌టౌన్ సీఐకోటేశ్వర్ కేసు దర్యాప్తుచేపట్టారు. ప్రధాన నిందితులైన జోరేపల్లి ప్రదీప్ రెడ్డి, అతడి స్నేహితుడు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిని సోమవారం కోర్టులో హాజరు పరిచారు. తప్పుడు పత్రాలను సృష్టించడం, తప్పుడు ఫ్యామిలీ ధ్రువపత్రం, తండ్రి మరణధ్రువపత్రాలు జారీ చేసినందుకు రెవిన్యూ అధికారులు, తప్పుడు సాక్షి సంతకాలు, అఫిడవిట్ దాఖలు చేసినందుకు ఇతర ప్రభుత్వశాఖ అధికారులపై విచారణ కొనసాగుతున్నదని సీఐ తెలిపారు. గతంలో కరీంనగర్ తహసీల్దార్‌గా పనిచేసి, ప్రస్తుతం కలెక్టరేట్‌లో కీలక అధికారిగా పనిచేస్తున్న ఒకరెవెన్యూ అధికారితోపాటు మరో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులపై కేసు నమోదైనట్లు త్వరలోనే వారిని అరెస్టు చేయనున్నట్లు సమాచారం.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోర్కల్ గ్రామంలో ఎలాంటి అనుమతి లేకుండా మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ రేగుల తిరుపతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిమండలం చింతకుంట సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జరుపుల శ్రీధర్(25) సోమవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి తెలిపారు. చింతకుంటకు చెందిన శ్రీధర్ కారుడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రంబైక్‌పై కరీంనగర్‌కు వెళ్తు న్నాడు. గేదెనుఅడ్డు తప్పించబోగా బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ప్రమాదంలో శ్రీధర్ తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108లో ప్రైవేట్‌ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందా డని, శ్రీధర్ భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఫేక్ యాప్‌ను ప్రమోట్ చేసిన వ్యక్తిపై కేసు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఫేక్‌యాప్‌ను ప్రమోట్‌చేసిన సిరిసిల్ల పట్టణంలోని విద్యా నగర్‌కు చెందిన కంసాని ఆకాష్(23)పై సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సిఐ కె కృష్ణ తెలిపారు. ఇతనుఇన్‌స్టాగ్రామ్‌లో ఫేక్‌యాప్‌లను ప్రమోట్‌చేస్తూ వీడియోలుచేసి యువతను తప్పుదోవ పట్టే విధంగా పోస్టు చేస్తున్నాడని ఆయన తెలిపారు. ఇదే విధంగా రాజా గేమ్స్‌యాప్‌ను ప్రమోట్ చేస్తూ సులభంగా డబ్బు సంపాదించవచ్చని తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టుచేసి యువతను తప్పుదోవ పట్టిస్తున్నాడని ఫిర్యాదురావడంతో అతనిపై కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.ఫేక్ యాప్‌లను నమ్మి మోసపోవద్దని, యాప్‌ల ప్రభావంతో మీ డబ్బులను కోల్పోవద్దని ఆయన తెలిపారు.



పతకాలు సాధించిన జైలు ఉద్యోగులను అభినందిస్తున్న జైలు సూరింటెండెంట్ విజయ్‌డేని

రాష్ట్రస్థాయి పోటీల్లో కరీంనగర్ జిల్లా జైలు సిబ్బందికి పతకాలు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జైళ్ల శాఖ ఉద్యోగులకు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో కరీంనగర్ జిల్లా జైలు సిబ్బంది ఆరు స్వర్ణం, 12 రజత పతకాలు సాధించారు. జైళ్లశాఖ 7వ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 37 జైళ్లకు సంబంధించిన 250 మంది అధికారులు, సిబ్బంది హాజరవగా కరీంనగర్ జిల్లా జైలు నుంచి 17 మంది వివిధ క్రీడల్లో పాల్గొన్నారు. కరాటే, లాంగ్ జంప్, 800 మీటర్ల పరుగు, టీం కరాటే, మిమిక్రీ విభాగాల్లో ఆరు బంగారు పతకాలు సాధించారు. బెస్ట్ ప్రాక్టిస్ ఇన్ జైల్, వెల్ఫేర్ ఆఫీసర్, హైజెన్ ఇన్ జైల్, హై జంప్, 100, 400 మీటర్ల పరుగు పందెం, కరాటే, బాస్కెట్ బాల్, ఫైన్ ఆర్ట్స్, ఫొటోగ్రఫీ, వ్యాసరచన పోటీల్లో 12 రజత పతకాలు సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా జైలులో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిబ్బందిని జైలు సూరింటెండెంట్ జీ.విజయ్‌డేని అభినందించారు. ఈ కార్యక్రమంలో జైలు వైద్యాధికారి వేణుగోపాల్, జైలర్ శ్రీనివాస్, రమేష్, డిప్యూటీ జైలర్స్ శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రమేష్, అజయ్‌చారి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలోని బీజేపీ మండల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా నియామకమైన బీజేపీ మండలాధ్యక్షులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చూపించాలన్నారు. మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు గెలవడం ఖాయమన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల పక్షాన పోరాటం చేసిన పార్టీగా ఒక్క బీజేపీకే ఓట్లు అడిగే హక్కు ఉందన్నారు. మేధావులు ఆలోచించి బీజేపీని ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీలు రఘునందన్‌రావు, జి.నగేష్, ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకట రమణారెడ్డి, పాయల శంకర్, పాల్వాయి హరీష్‌బాబు, మాజీ ఎమ్మెల్యేలు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, చింతల రాంచంద్రారెడ్డి, బొడిగె శోభ, పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్లు సునీల్‌రావు, డి.శంకర్, ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టులో 28న టెండర్లు



మల్యాల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో నిర్వహించే పలు దుకాణాలకు ఈ నెల 28న టెండర్లు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఏడాది కాల పరిమితితో కొబ్బరి కాయల విక్రయం, కొబ్బరి ముక్కల ప్రోగు, పూలు, పండ్ల విక్రయం, గాజులు, ప్లాస్టిక్ వస్తువుల విక్రయం, పుట్నాలు, ప్యాలాల విక్రయం, హోటల్, ఫోటో స్టూడియో, సామాన్లు భద్రపరచుకునే హక్కు, స్నానాలు, మరుగుదొడ్లు, కిరాణం, కూల్ డ్రింక్స్, ఐస్‌క్రీం, చెప్పులు భద్ర పరచడం, వంట చెరుకు అమ్మకం కోసం ఈ-టెండర్, సీల్డ్ టెండర్, బహిరంగవేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి కుంగ్‌ఫూ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మల్యాల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ పోటీల్లో మల్యాలలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ప్రతిభ చాటి బంగారు, కాంస్య పతకాలు సాధించారు. సీనియర్స్ విభాగంలో కె. సంజన బంగారు పథకం, జి.నిత్య, కె. చంద్రకళ కాంస్య పథకాలు సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు నీర్ల నీరజ, పీఈటీ అంజనేయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా లొంకరామేశ్వరుడి శోభాయాత్ర

కథలాపూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలోని పోతారంలో సోమవారం శ్రీ లొంకరామేశ్వరస్వామి శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. కొండపై కొలువైన స్వామిని పల్లకిలో పుర వీధుల వెంట శివస్వాములు ఊరేగించారు. భక్తులు స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ప్రతీ వీధి వెంట శోభాయాత్ర జరగగా మహిళలు, చిన్నారులు స్వామివారి దర్శించుకున్నారు.



సుల్తానాబాద్‌లోని గ్రంథాలయ భవనం

వందేళ్ల లైబ్రరీ

- సుల్తానాబాద్ గ్రంథాలయానిది ఘన చరిత్ర
- ఉర్దూకు వ్యతిరేకంగా ఉవ్వెత్తున లేచిన లైబ్రరీ ఉద్యమం
- దాతల సహకారంతో భవనానికి స్థలం
- 1923లో ప్రారంభం
- నాటి హైదరాబాద్ రాష్ట్రంలో ఏర్పాటు
- ఎంతో మందికి విజ్ఞానాన్ని అందించిన లైబ్రరీ

సుల్తానాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని గ్రంథాలయానికి వందేళ్ల చరిత్ర ఉంది. ఎంతో మందికి ఉద్యోగ అవకాశాలను, మరెందరికో విజ్ఞానాన్ని అందించింది ఈ గ్రంథాలయం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాటి హైదరాబాద్ స్టేట్ పాలనలో సుల్తానాబాద్‌లో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. 1923లో అప్పటి హైదరాబాద్ స్టేట్‌లో ఆనాటి నిజాం ప్రభుత్వం (మూడు రాష్ట్రాలలో విస్తరించి ఉంది) 13 లైబ్రరీలకు ఆమోదం తెలిపింది. అందులో ఒకటి సుల్తానాబాద్‌లో 1923లో ఏర్పాటు చేశారు. అనాటి నుంచి ఇప్పటి వరకు గ్రంథాలయం అదే ప్రదేశంలో కొనసాగుతోంది.

సుల్తానాబాద్‌లో గ్రంథాలయానికి 102 సంవత్సరాల చరిత్ర కలిగి ఉంది. నాటి హైదరాబాద్ స్టేట్ నిజాం పాలనలో రాష్ట్రం అంతా ఉర్దూ భాష అమల్లో ఉండడంతో తెలుగు పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి తలెత్తింది. దీంతో కొందరు మేధావులు, పండితులు భాషాభిమానులు తెలుగును బతికించుకోవడం కోసం, తెలుగులో మాట్లాడడం, చదవడానికి అవసరమైన ఏర్పాట్లు ఉండాలని భావించారు. అందులో భాగంగా హైదరాబాద్ స్టేట్ పాలనలో లైబ్రరీ ఉద్యమం మొదలైంది. అలా ఉవ్వెత్తున లేచిన లైబ్రరీ ఉద్యమం మూలంగా ప్రభుత్వం స్పందించి 16 జిల్లాలో కూడి ఉన్న నాటి హైదరాబాద్ రాష్ట్రంలో 13 లైబ్రరీల ఏర్పాటుకు అమోదం తెలిపింది. వాటిలో సుల్తానాబాద్‌లో కూడా ఒకటి ఏర్పాటయింది. లైబ్రరీ ఉద్యమంలో సుల్తానాబాద్‌కు చెందిన పుర ప్రముఖులు పలువురు పెద్ద ఎత్తున పాల్గొనడంతో నాటి ఉమ్మడి జిల్లాలో మొట్టమొదటి లైబ్రరీని సుల్తానాబాద్‌కు 1923లో మంజూరు చేశారు.

సురవరం, మాడపాటి చేతుల మీదుగా..

నాటి హైదరాబాద్ స్టేట్‌లో లైబ్రరీ ఉద్యమంలో, తెలుగు పరిరక్షణకు పాటుపడుతున్న వారిలో ప్రముఖులైన సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హన్మంతరావు తదితరులు 1923లో సుల్తానాబాద్‌లో లైబ్రరీని ప్రారంభించారు. లైబ్రరీ ఏర్పాటుకు స్థలం లేకపోవడంతో దేశోపంతుల వేణుగోపాలరావు కొంత స్థలాన్ని కొనుగోలు చేసి లైబ్రరీని నిర్మించారు. హైదరాబాద్ స్టేట్ నిజాం పాలనలో తెలుగు పుస్తకాలు ఉండకపోవడంతో వేణుగోపాల్‌రావు తదితరులు విజయవాడ వెళ్లి తెలుగు పుస్తకాలను కొనుగోలు చేసి సుల్తానాబాద్ లైబ్రరీలో అందుబాటులో ఉంచారు. అలా 1923 నుంచి కొనసాగుతున్న లైబ్రరీ 1976లో లోకల్ లైబ్రరీ ఆథారిటీ వారి ఆధీనంలోకి వెళ్లింది. అనాటి ప్రభుత్వం లైబ్రరీలన్నింటిని తమ ఆధీనంలోకి తీసుకుని వాటి నిర్వహణకు లోకల్ లైబ్రరీ ఆథారీటికి అప్పగించింది.

అయితే అప్పటికే శిథిలావస్థలో ఉన్న లైబ్రరీకి నూతన భవనం నిర్మించాల్సిన అవసరం ఏర్పడింది. లైబ్రరీ నిర్వహిస్తున్న భవనం స్థలం ఆనాటి నుంచి వేణు గోపాలరావు పేరిటనే ఉంది. అలా ఉంటే ప్రభుత్వం నుంచి నిధులు రావని తెలువడంతో వేణుగోపాలరావు తన పేరిట ఉన్న స్థలాన్ని లైబ్రరీ అథారిటీ వారికి బదలాయించారు. దాంతో నిధులు మంజూరు కావడంతో భవనం నిర్మించారు. మరో విశేషమేమిటంటే లైబ్రరీలోనే ఓ రేకుల షెడ్డు వేసి ఆనాటి సుల్తానాబాద్ మొదటి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని నిర్వహించడం గమనార్హం.

1923 లో సుల్తానాబాద్‌లో లైబ్రరీ ఏర్పాటు

దేశోపంతుల క్రిష్ణమూర్తి, సీనియర్ న్యాయవాది



నాటి మూడు రాష్ట్రాల పరిధితో కూడి ఉన్న హైదరాబాద్ స్టేట్ పాలనలో సుల్తానాబాద్‌లో 1923 లో లైబ్రరీని ఏర్పాటు చేశారు. అంతటా ఉర్దూమయం అయిన కాగా అందుకు వ్యతిరేకంగా తెలుగును పరిచయం చేయడానికి సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హన్మంతరావులు ఉద్యమాన్ని ప్రా రంభించారు. వేణుగోపాలరావు సొంతంగా స్థలం కొని శ్రీ వేణుగోపాలరావు ఆంధ్ర భాషా నిలయం పేరిట సుల్తానా బాద్‌లో లైబ్రరీ ఏర్పాటు చేయగా 1923లో సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హన్మంతరావులు ప్రారంభించారు. విజయవాడ నుంచి ఆనాడు తెచ్చిన బుక్స్ ఇప్పటికీ ఉన్నాయి. ఈ లైబ్రరీకి వందేళ్ల పై చరిత్ర ఉంది.

శతాబ్ది ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తాం

అన్నయ్య గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్



వందేళ్ల చరిత్రను కలిగి ఉన్న సుల్తానాబాద్ లైబ్రరీ పేరిట త్వరలో శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తాం. 1923 లో ఏర్పాటైన ఈ లైబ్రరీకి ఇంతటి ఘన చరిత్ర కలిగి ఉండడం సుల్తానా బాద్ పట్టణానికి గర్వకారణం. ఎమ్మెల్యే విజయరమణారావు తో చర్చించి ఉత్సవాల నిర్వహణకు కృషి చేస్తాం.

ఎంతో మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించింది

శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల వనజ, రిటైర్డు ప్రభుత్వ ప్రధానోపాధ్యాయురాలు



సుల్తానాబాద్ పట్టణంలోని లైబ్రరీ ఎంతో మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించింది. మరెందరికో అక్షర జ్ఞానాలు అందించింది. తాను యాభై ఏళ్ల కిందటే ఈ లైబ్రరీలో బుక్స్ చదవేదాన్ని. అప్పుడే చాలా మంది యువకులు విద్యార్థులు కూడా పరీక్షల కోసం, ఇతర సమాచారం కోసం లైబ్రరీ పై ఆధారపడ్డారు. రాష్ట్రంలో అతి పురాతన లైబ్రరీలలో ఇది ఒకటి. పాఠకులకు వసతి సౌకర్యాలు కల్పించడంలో దాతలు కూడా తమ వంతు సహకారం ప్రోత్సాహం అందించారు.



గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలు

రాష్ట్రంలో 55వేల ఉద్యోగాలు ఇచ్చాం

జాబ్ క్యాలెండర్ ప్రకారం మరిన్ని ఉద్యోగాలు

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



పెద్దపల్లిలో జరిగిన సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

పెద్దపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇప్పటి వరకు 55 వేల ఉద్యోగాలు కల్పించామని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు జాబ్ క్యాలెండర్ ప్రకటించామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. సోమవారం నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మాట్లాడుతూ అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి ఈ ప్రాంతంలో విద్యా సంస్థలను నెలకొల్పి నాణ్యమైన విద్యను అందించాడని పేర్కొన్నారు. పెద్దపల్లిలో టాస్క్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నామన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీని స్థాపించి వెయ్యి మందికి శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగాలు భర్తీ కాలేదని, ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టలేదని, పదోన్నతులు ఇవ్వలేదన్నారు. పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని శ్రీధర్ బాబు పిలుపు నిచ్చారు. ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ భాను ప్రసాదరావు, ఎమ్మెల్యేలు విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ నరేందర్ రెడ్డిని గెలిపించు కోవాలని పిలుపునిచ్చారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థులు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

భీమారం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆల్ ఇండియా ఇంటర్ డిస్ట్రిక్ట్ జాతీయ స్థాయి సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జవ్వాజి అశోక్ తెలిపారు. పాఠశాలకు చెందిన అంతడుపుల శ్రీహర్ష, కొత్తపల్లి హర్షవర్ధన్, ఆడ కృష్ణ, గుండేటి ప్రణీత్, జిల్లా మణి అమృత్, తొట్ల రిషి వర్ధన్, పుప్పాల రఘువీర్ ఎంపికైనట్లు పీఈటీ పెసరి తిరుమలేశ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను మాజీ సర్పంచ్ చెక్కపెల్లి అరుణ రఘు, మాజీ ఎంపీటీసీ పల్లి అర్జున్, ఏఏపీ చైర్మన్ డిండిగల లావణ్య, మాజీ ఉప సర్పంచ్ బసవరాజుల రాజు, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ నాంపల్లి లక్ష్మినర్సయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

వేములవాడ క్షేత్రం.. భక్తజన సంద్రం

- రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు
- స్వామి వారి దర్శనానికి ఆరు గంటల సమయం



క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు





భక్తులతో కిక్కిరిసిపోయిన ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి సోమవారం పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. తెల్లవారు జామునుంచే భక్తులు తలనీలాలు సమర్పిం చుకునేందుకు రాజన్న ఆలయ ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించారు. రాజన్నకు అత్యంత ప్రీతి పాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు సుమారు 6 గంటల పాటు నిరీక్షించారు. ధర్మదర్శనం క్యూలైన్‌లోని భక్తులకు శ్రీస్వామి వారి దర్శనం కోసం 5 గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. శీఘ్రదర్శనం, బ్రేక్ దర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయం లోకి చేరుకుని శ్రీలక్ష్మీగణ పతిని, ఆది దేవుడిని దర్శించుకుని జగజ్జనని శ్రీపార్వతి దేవికి ఓడిబియ్యం సమర్పించు కుని మొక్కులు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాలైన శ్రీఅనంతపద్మనాభ స్వామి, శ్రీసీతరామ చంద్రస్వామి, సోమేశ్వర, బాలాత్రిపురసుందరిదేవి, సుబ్రమణ్యస్వామి, శ్రీభీమేశ్వర, నగరేశ్వర స్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొని దర్శించుకుని తరించారు. సుమారు 50 వేల మంది భక్తులకు శ్రీస్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయాధికారులు వెల్లడించారు. ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యం లో అధికారులు పర్యవేక్షించారు.

బద్దిపోచమ్మ అమ్మవారికి మొక్కులు

వేములవాడ రాజన్న ఆలయానికి అనుబంధ ఆలయమైన శ్రీబద్దిపోచమ్మ అమ్మవారికి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. మట్టికుండలో అమ్మవారికి నైవేద్యాన్ని వండుకుని డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరకున్న భక్తులు అమ్మవారికి పట్నాలు వేసి, ఓడి బియ్యం సమర్పించారు.

ఫిట్స్‌తో పడిపోయిన భక్తుడు

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి వచ్చిన భక్తుడు క్యూలైన్‌లో వున్న సమయంలో ప్రమాదశాత్తు ఫిట్స్ వచ్చి పడిపోయాడు. మంచిర్యాల జిల్లా లక్షెట్‌పేట్ మండల కేంద్రానికి చెందిన లెకల తిరుపతి అనే భక్తుడు సోమవారం కటుంబ సభ్యులతో కలిసి రాజన్న దర్శనానికి వచ్చాడు. శ్రీస్వామి వారి దర్శించుకునేందుకు క్యూలైన్‌లో వెళుతున్న సమయంలో హఠాత్తుగా ఫిట్స్ వచ్చింది. దీంతో అక్కడే ఉన్న బీఆర్ఎస్ నేతలు అతన్ని వెంటనే ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆలయంలో ప్రథమ చికిత్స కేంద్రం అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, భక్తుల సౌకర్యార్థం ప్రథమ చికిత్స కేంద్రం ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ నేతలు కోరారు.

లక్ష్మీ నరసింహస్వామి రథోత్సవం

బీర్‌పూర్ జాతరకు తరలివచ్చిన భక్తులు



రథయాత్రలో పాల్గొన్న భక్తులు

బీర్‌పూర్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్‌లోని లక్ష్మీ నరసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాలలో సోమవారం రథోత్సవం కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవ మూర్తులకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని గుట్టపై నుంచి ప్రత్యేకంగా అలంకరించిన శావపై గుట్ట కిందికి తీసుకువచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవ నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీఎస్పీ రఘు చందన్, జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి, బీర్‌పూర్ ఎస్సై కుమార స్వామి ఆధ్వర్యంలో భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. ఈ బ్రహ్మోత్సవాలలో జిల్లా కేడీసీసీ మెంబర్ ముప్పాల రాంచందర్ రావ్, మాజీ ఎంపీపీ మసర్తి రమేష్, తహసీల్దార్ ముంతాజుద్దీన్, ఎంపీడీవో లచ్చాలు, ఆలయ కార్యనిర్వాహణ అధికారి శ్రీనివాస్, ఆలయ మాజీ చైర్మన్‌లు నేరెల్ల సుమన్, ఎనగంటి స్వామాట్, ఆలయ ధర్మకర్తలు, అర్చకులు ఒద్దిపర్తి పెద్ద సంతోష్, మధు కుమార్, చిన్న సంతోష్ పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

న్యూస్ బాక్స్

వీర్నపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి):వీర్నపల్లి మండలం బంజేరు గ్రామంలో గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ గుడి పందిరిని, జెండాలను అటవీ శాఖ అధికారులు సోమవారం ధ్వంసం చేశారని గిరిజనులు మండిపడుతున్నారు. ఇదే విషయంపై ఎఫ్ఎస్ఓ భూలక్ష్మిని వివరణ కోరగా అటవీ ప్రాంతంలో గిరిజ నులు అనుమతులు లేకుండా పందిరి వేసి సేవాలాల్ జయంతి నిర్వహించా రని పేర్కొన్నారు. అటవీ భూమిలో అను మతులు లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మండల ప్రెస్‌క్లబ్ కార్యవర్గ సభ్యులను స్థానిక గవర్న మెంట్ అసిస్టెంట్ ప్లీడర్ పసుల కృష్ణ కార్యాలయంలో సోమవారం ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన గుండారపు కృష్ణారెడ్డిని ముస్తాబాద్ తాజా, మాజీ ఎంపీపీ శరత్‌రావు శాలువా కప్పి సన్మానించారు.

● ఎల్లారెడ్డిపేట: మండలంలోని అల్మాస్‌పూర్ శివారులో సిరిసిల్ల వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు సాంకేతిక కారణం వల్ల సోమవారం మధ్యలో నిలిచిపోయింది. మార్గమధ్యలో బస్సు నిలిచిపోవడం వల్ల ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు.

● రుద్రంగి: రుద్రంగి మండలం మానాల శంభులింగేశ్వరస్వామి కల్యాణం, జాతరకు హైదరాబాద్‌లో ఉంటున్న మానాల గ్రామానికి చెందిన గుగులోత్ ప్రకాష్ అన్నదానం కోసం 15 క్వింటాళ్ల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో తూం జలపతి, జక్కు మోహన్, పిసరి చిన్న భూమయ్య పాల్గొన్నారు.

● వేములవాడ కల్చరల్: వేములవాడ పట్టణంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ స్వగృహంలో సోమవారం మహా లింగార్చన వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప్ రామకృష్ణ, పార్టీ రాష్ట్ర ఉపాధ్య క్షులు ఎన్‌వీఎస్ ప్రభాకర్ పాల్గొన్నారు.

● చందుర్తి: మండలంలోని ఆశిరెడ్డి పల్లె గ్రామంలో బీరప్ప కామరతి స్వామి వారి కల్యాణ మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని, స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం, మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించి.. న్యాయం చేయండి

● ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతుల వెల్లువ

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 17 : (అంధ్రజ్యోతి), తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలంటూ ప్రజలు ప్రజావాణిలో కలెక్టర్‌తో పాటు జిల్లా అధికారులను కలిసి విన్నవించారు. సిరిసిల్ల జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో సమస్యలు చెప్పుకునేందుకు జిల్లా నలుమూల నుంచి ప్రజలు కలెక్టరేట్‌కు తరలిరావడంతో కిటకిటలాడిపోయింది. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజావాణి కేంద్రంలో అదనంగా ఫిర్యాదులు వస్తున్న ఇందిరమ్మ ఇంటి దరఖాస్తుల కోసం ఈఈ చెన్నయ్య, జిల్లా ఇన్‌చార్జి పంచాయతీ అధికారి శేషాద్రిలకు ప్రత్యేక టేబుళ్లను ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ ప్రజావాణిలో 116 దరఖాస్తులు రాగా ఇందులో సిరిసిల్ల మున్సిపాల్టీకి 14, జిల్లా రెవెన్యూ శాఖకు 52, జిల్లా సంక్షేమాధికారికి 6, ఉపాధి కల్పన అధికారికి 6, కోనరావపేట ఎంపీడీవోకు 4, జిల్లావైద్యాధికారికి 3,జిల్లా నీటిపారుదలశాఖకు 3, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖకు 3, జిల్లా విద్యాశాఖకు 3, వ్యవసాయశాఖకు2, సెస్‌కు 2, ఎస్పీకార్యాలయాన్నికి 2, తంగళ్లపల్లి ఎంపీడీవోకు 2, అటవీశాఖకు 1, ఎస్టీసీకి1, ఆర్టీవోకు1, భూగర్భ మైనింగ్ శాఖకు1, ఏక్సైజ్‌శాఖకు1, అర్‌సీవోకు1, ఎస్సీ కార్పొరేషన్‌కు1, మత్స్య శాఖకు 1, జిల్లా పౌరసరఫరాల శాఖకు1, వీర్నపల్లి ఎంపీడీవోకు1, చందుర్తి ఎంపీడీవోకు 1, వేములవాడ ఎంపీడీవోకు 1, గంభీరావుపేట ఎంపీడీవోకు1, బోయినపల్లి ఎంపీడీవోకు1 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి త్వరితగితన పరిష్కారం చూపాలన్నారు. డీఆర్‌డీవో శేషాద్రి, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించండి

జిల్లాలో జీవిస్తున్న మాకు అద్దెకు ఉండేదుకు ఎవరూ ఇళ్లు ఇవ్వడం లేదని ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఇండ్లను అందించడంతో పాటు తమకు సబ్సిడీపై వాహనాలను అందించాలని సోమవారం ట్రాన్స్ జెండర్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూను కలిసి విన్నవించడంతో పాటు అగ్రహారంలో తమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే ఉచిత చలివేంద్రాన్ని ప్రారంభించాలని కోరారు.

గుడిపేట రామలింగేశ్వరస్వామి ఆలయానికి రోడ్డును నిర్మించండి

కోనరావుపేట మండలంలోని నిజామాబాద్ గ్రామశివారులోని గుడిపేట రామలింగేశ్వర స్వామి అలయంలో మహా శివరాత్రి సందర్భంగా జాతర జరుగుతుందని ఆలయానికి వెళ్లేందుకు సరైన రోడ్డు లేనందున రోడ్డు నిర్మించాలని అలాగే తాత్కాలిక రోడ్డు కోసం మొరం కోసం అనుమతులు ఇవ్వాలని గుడిపేట రామలింగేశ్వర స్వామిదేవాలయం కమిటీ చైర్మన్ కెతిరెడ్డి జగన్ మోహన్‌రెడ్డితో పాటు సభ్యులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలి

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని అలాగే బీసీలకు విద్య ఉద్యోగాల్లో జనాభా ప్రాతిపదికను రిజర్వేషన్ కల్పించాలని అసెంబ్లీతోపాటు ప్లారమెంట్ సమావేశాల్లో తీర్మానాలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటుచేసి దేశవ్యాప్తంగా బీసీ కులగణనను చేపట్టి సమగ్ర కుటుంబ కులగణన సర్వేను పారదర్శకంగా చేపట్టాలని బీసీ సాధికారత సంఘం నాయకులు సోమవారం జిల్లా కలెక్టరేట్‌కు తరలివచ్చి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో బీసీసాధికారిత సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొండ దేవయ్య ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు పోలాస నరేందర్ నాయకులు పాల్గొన్నారు.

సినియర్ సిటిజన్‌లకు ప్రత్యేక దర్శనం కల్పించాలి

వేములవాడలోని శ్రీరాజరాజేశ్వర స్వామి దేవాలయంలో స్వామి వారి దర్శనం కోసం సీనియర్ సిటిజన్‌లకు ప్రత్యేక కౌంటర్‌లను ఏర్పాటు చేయడంతోపాటు మహాశివరాత్రికి సైతం దీనిని అమలు చేయాలని తెలంగాణ అల్ సీనియర్ సిటిజన్ అసోషియేషన్ జిల్లా కమిటి అధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ జనుపాల శంకరయ్య, కోశాధికారి దొంత దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసిన ట్రాన్స్‌జెండర్లు

రుణాలకు రావాల్సిన సబ్సిడీ ఇప్పించండి

- అవురం లత, మంగళ్లపల్లి, కోనరావుపేట



కోనరావుపేట మండలం మంగళ్లపల్లి గ్రామానికి చెందిన తనకు మండల ఎంఎఫ్‌పీఐ పథకం కింద మైక్రో ఫుడ్ కార్పొరేషన్ ద్వారా మంజూరైన రుణాలను రెండు సంవత్సరాల క్రితం వ్యాపారం కోసం తీసుకున్నా. ఆ రుణాలకు మంజూరైన సబ్సిడీ ఇప్పించాలి. సంబంధిత అధికారులను అడిగితే సబ్సిడీ డబ్బులు వచ్చాయని తెలిపారని అయితే ఆ సబ్సిడీ డబ్బులు ఇంతవరకు జమ కాలేదని కలెక్టర్ స్పందించి విచారణ చేయించి సబ్సిడీ డబ్బులను ఇప్పించాలి.

ప్రభుత్వ భూమి కలిగి ఉన్న వారిపై చర్యలు తీసుకోవాలి

- వెన్నమనేని రామచందర్‌రావు, సిరిసిల్ల



తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్‌లో గ్రామంలోని సర్వేనంబర్ 237/20లో ఎకరం 20 గుంటల ప్రభుత్వ భూమి కల్గిన వెలమ సామాజిక వర్గానికి చెందిన మెన్నేని సరళపై చర్యలు తీసుకోని ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. సరళ భర్త మెన్నేని నర్సింగరావు ఇరిగేషన్ శాఖలో ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ మృతి చెందాడని ఆయనకు వచ్చే ప్రభుత్వ పెన్షన్‌తోనే ఆ కుటుంబం జీవిస్తుందని తెలిపారు. వీరి కుమారులు ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి విచారణ చేపట్టి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి.

వీఆర్‌వో అక్రమాలపై విచారణ చేపట్టాలి

- గుర్రం రాజలింగం, మాజీ సర్పంచ్ తాడూర్, తంగళ్లపల్లి



తంగళ్లపల్లి మండలంలో తాడూర్ గ్రామంలో సర్పంచ్‌గా పనిచేస్తున్న కాలంలో 2017 సంవత్సరంలో వీఆర్‌వోగా పనిచేసిన చంద్రగిరి సంతోష్ అప్పటి అధికారంలో ఉన్న పార్టీలో చేరలేదనే సాకుతో నాపై అన్యాయంగా కేసులు నమోదు చేయడం జరిగింది. దీనిపై సమాచార హక్కు చట్టం కింద అతని వివరాలను సేకరించగా ఆయన శాంతిరాజు పేరులో వీఆర్‌వోగా విధులు నిర్వహిస్తున్నాడని అధికారులు నివేదిక అందించారని తెలిపారు. తనతోపాటు తన కుటుంబంపై అక్రమ కేసులు పెట్టించిన అతనిపై జిల్లా కలెక్టర్ స్పందించి విచారణ జరిపించి న్యాయం చేయాలని రాజలింగం కోరారు.

మండలి పోరు.. ప్రచార జోరు

(5వ పేజీ తరువాయి)

చేర్పి మద్దతు కూడగట్టుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో ఎన్నికల వాతావరణం జోరుగా ఉంది. అధికార యంత్రాంగం జిల్లాలో 41 పోలింగ్ కేంద్రాల ద్వారా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. టీచర్ల ఎమ్మెల్సీ కోసం 13 పోలింగ్ కేంద్రాలు, గ్యాడ్యుయేట్లకు 28 కేంద్రాలు ఏర్పాటు చేశారు.

జిల్లాలో ఎమ్మెల్సీ ఓటర్లు 23,347

గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో 23,347 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్లు 22,397 మంది ఉండగా పురుషులు 13,772 మంది, మహిళలు 8,625 మంది ఉన్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఓటర్లు 950 మంది ఉండగా పురుషులు 677 మంది, మహిళలు 273 మంది ఉన్నారు. గత ఎన్నికల కంటే ఓటర్ల సంఖ్య పెరిగింది. 2019 ఎన్నికల్లో గ్రాడ్యుయేట్ 10,584 మంది ఉండగా పురుషులు 7,390, మహిళలు 3,192 మంది ఉన్నారు. టీచర్లకు సంబంధించి 783 మంది ఉండగా పురుషులు 600, మహిళలు 183 మంది ఉన్నారు. గత ఎన్నికల కంటే 12,147 ఓట్లు పెరిగాయి. ఇందులో గ్రాడ్యుయేట్లు 11,980 మంది, టీచర్లలో 167 మంది పెరిగారు.

సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలి

● ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా కృషిచేస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో 18 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరస్థుల పట్ల కఠిన వైఖరి అవలంభిస్తూ శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. బాధితులకు సత్వర న్యాయం చేయడానికే గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. భూ తగాదాలు, ఆస్తి తగాదాల విషయంలో చట్ట ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ బాధితులకు న్యాయం అందించే విధంగా చూస్తామన్నారు. గ్రీవెన్స్ డేలో ఇచ్చిన ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు సమర్థవంతంగా సేవలు అందిస్తున్నామన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై పోరాడుతా

● టీచర్ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, విద్యా సమస్యలపై అవగాహన ఉన్న తనను ఆదరించాలని బీజేపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య కోరారు. సిరిసిల్ల పట్టణంలోని సిరిసిల్ల ప్రోగ్రెసివ్ టీచర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కార్పొరేట్ వ్యక్తిని కాదని, గవర్నమెంట్ స్కూల్‌లో చదువుకొని మీలాంటి టీచర్లు పాటలు చెప్తే ఈ స్థాయికి ఎదిగానన్నారు. మూడు దశాబ్దాలకు పైగా విద్యా వ్యవస్థలో ఉన్నానని తమ సంస్థల్లో వేలకు పైగా టీచర్లు పనిచేస్తున్నారని అన్నారు. గతంలో ఎమ్మెల్సీగా ఎవరు గెలిచినా ప్రభుత్వంలో చేరారు. కానీ మీ సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వంతో పోరాడలేదన్నారు. మీరు మేధావులు ఈసారి ఆలోచించి మీ సమస్యల పరిష్కారానికి కొట్లాడే వ్యక్తిగా ఉన్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మండలికి పంపించాలని టీచర్లకు విజ్ఞప్తి చేశారు. విద్యావ్యవస్థలో అనేక ఏళ్లుగా సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ సమావేశంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లికార్జున స్వామి పట్నాలు

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలంలోని మారుపాక గ్రామంలోని ఐలవేని శ్రీమల్లికార్జున స్వామి పట్నాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఒగ్గు కళాకారులు భారీ పట్నం వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణయాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన మల్లికార్జున స్వామి పట్నాల కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.

వేములవాడ మండల మారుపాక గ్రామంలో నిర్వహించిన మల్లికార్జున స్వామి వారి పట్నాలకు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు దర్శించుకున్నారు.

విద్యార్థులకు స్టడీ చైర్లు అందజేత

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు స్థానికుడు, సామాజిక కార్యకర్త సిర్రం రమేశ్ రూ.30 వేల విలువైన స్టడీ చైర్లను సోమవారం అందజేశారు. గ్రామంలోని జంగ నర్సిరెడ్డి పాఠశాల గేటు ఏర్పాటుకు రూ.50 వేలు విరాళం అందజేశారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన రమేశ్, నర్సిరెడ్డిలను ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకట్‌రెడ్డి, స్థానికులు యూసుఫ్, పర్శరాంరెడ్డి, లక్ష్మారెడ్డి, నర్సిరెడ్డి, దేవిరెడ్డి, ఎల్లం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణం కృష్ణ ఫంక్షన్ హాల్‌లో స్పార్క్ కుంగ్ ఫూ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీలలో క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ముందుగా స్పార్క్ కుంగ్ ఫు అకాడమీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ఎం రాజేశం రాష్ట్ర స్థాయి కుంగ్ ఫు కరాటే పోటీలను ప్రారంభించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రథమ స్థానంలో, కరీంనగర్ జిల్లా ద్వితీయ స్థానంలో, మంచిర్యాల జిల్లా తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు ముఖ్య అతిథులు స్పార్క్ కుంగ్ ఫు అకాడమీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు రాజేశం మాస్టర్, హెల్పింగ్ హార్ట్ స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ పున్నంచందర్ ట్రోఫీలతో పాటు మెడల్స్ అందించారు.

● చందుర్తి: రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో చందుర్తి మండలం మూడపల్లి, నర్సింగాపూర్ గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించినట్లు స్పార్క్ కుంగ్‌ఫు అకాడమీ మాస్టర్ నేరెళ్ల శ్రీధర్‌గౌడ్ సోమవారం తెలిపారు. మూడపల్లి విద్యార్థులు 12, నర్సింగాపూర్ విద్యార్థులు 6 పతకాలు సాధించారన్నారు.

ఎండిపోయిన వృక్షం తొలగింపు

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కోనరావుపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): 'పొంచి ఉన్న ప్రమాదం' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం అయిన కథనానికి గ్రామపంచాయతీ సిబ్బంది స్పందించారు. ప్రమాదకరంగా ఉన్న వృక్షాన్ని తొలగించారు. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామ ప్రధాన కూడలిలో ఒక చెట్టు ఎండిపోయి ప్రమాదకరంగా మారింది. చెట్టు కిందనే విద్యుత్ తీగలు ఉండటంతో ప్రమాకరంగా మారింది. గ్రామ పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది స్పందించి సోమవారం చెట్టును తొలగించారు.



తొలగించిన వృక్షం

విద్యార్థిని సన్మానించిన వికాస్ రావు

కోనరావుపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన అలువాల సాయి తేజ అనే విద్యార్థిని భారతీయ జనతా పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్ రావు సోమవారం సన్మానించారు. పరీక్ష పే చర్చ కార్యక్రమంలో ప్రధానమంత్రి మోదీతో పాల్గొన్న అల్వాల సాయి తేజ, వారి తల్లిదండ్రులను సన్మానించారు. బీజేపీ మండల అధ్యక్షుడు బాలాజీ, మాజీ జడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ, అంబోజ లక్ష్మీనారాయణ, జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన కదిరే శ్రీనివాస్‌గౌడ్ మృతి చెందగా ఆయన కుటుంబాన్ని, నిజామాబాద్ గ్రామానికి చెందిన పాలకుర్తి శ్రీనివాస్ తల్లి మృతి చెందగా వారి కుటుంబాలను భారతీయ జనతా పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు సోమవారం పరామర్శించారు. మాజీ జెడ్పీటిసి పల్లం అన్నపూర్ణ, బాలాజీ, గొట్టె రామచంద్రం, బెంద్రే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ నాయకుల అబద్ధపు ప్రచారం

ముస్తాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం ప్రాజెక్టుపై కేటీఆర్ , బీఆర్ఎస్ నాయకులు అబద్ధపు ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నామాపూర్ గ్రామంలో గల కేకే నివాస గృహంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కెకె మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఎస్సారెస్పీ వరద కాలువ ద్వారా ప్రభుత్వం నిర్మించిన ఎల్లంపల్లి, మిడ్ మానేరు ప్రాజెక్టు ద్వారా మల్లన్నసాగర్‌కు నీటిని అందించి అక్కడి నుండి సిరిసిల్ల నియోజకవర్గానికి నీరు అందుతుందని పేర్కొన్నారు. మల్లన్న సాగర్ ద్వారా ఎగువమానేరులోకి గోదావరి జలాలు వస్తున్నాయని ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కాళేశ్వరం ద్వారా గోదావరి జలాలు వస్తున్నాయని కేటీఆర్ గ్లోబల్ ప్రచారానికి తెరలేపారని పేర్కొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు ఎల్ల బాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ తలారి రాణి నర్సింలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

యూరియా కోసం రైతు నిరసన

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): యూరియా ఇవ్వకపోవడంతో కోనాయిపల్లిలో గ్రోమోర్ దుకాణం వద్ద ఓ రైతు సోమవారం నిరసన తెలిపాడు. ఈ విషయాన్ని అక్కడి రైతులు మండల వ్యవసాయ అధికారి సాయికృష్ణ దృష్టికి తీసుకెళ్లగా అక్కడికి చేరుకొని గొడవ సర్దుమణిగేలా మాట్లాడి రైతుకు నచ్చజెప్పాడు. రైతు10 బస్తాల యూరియా అడగడంతో ఇవ్వలేక పోయామని దుకాణ నిర్వాహకుడు తెలిపాడు.

పదవీకాలం పెంపుపై సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘ పాలకవర్గ సభ్యుల పదవీకాలాన్ని పొడిగించడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి సభ్యులు క్షీరాభిషేకం చేశారు. మండల కేంద్రంలోని ప్యాక్స్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడు రొండ్ల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ తమ పదవీకాలాన్ని పెంచడం హర్షనీయం అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు కోమటిరెడ్డి నర్సింహ్మారెడ్డి, కట్ట సుధాకర్‌రెడ్డి, జంగిటి కొమురయ్య, గజ్జల సత్తయ్య, పల్లె సృజన్‌రెడ్డి, పారిపెల్లి లక్ష్మి, నాయిని నవీన్‌కుమార్, కట్ట లచ్చయ్య, గన్నేరం వసంత ఉన్నారు.

గ్రామంపై కుంభమేళా జలాలు



రాచర్ల గొల్లపల్లిలో కుంభమేళా జలాలను వెదజల్లుతున్న డ్రోన్

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లికి చెందిన గణేశ్ ఇటీవల కుంభమేళాకు వెళ్లి పవిత్ర జలాలను తీసుకువచ్చాడు. సోమవారం డ్రోన్ సహాయంతో ఊరంతా ఆ జలాలను వెదజల్లాడు. గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉండాలని కుంభమేళా జలాలను వెదజల్లించానని గణేశ్ పేర్కొన్నాడు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆయనను అభినందించారు.

కేసీఆర్ పాలనలో రాష్ట్రం సస్యశ్యామలం

● బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

● ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



సిరిసిల్లలో కేక్ కట్ చేస్తున్న జిల్లా అధ్యక్షుడు ఆగయ్య



వేములవాడలో మొక్క నాటుతున్న బీఆర్ఎస్ నాయకులు



ఇల్లంతకుంటలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టులను నిర్మించి ఎత్తుపోతల పథకం ద్వారా రాష్ట్రాన్ని, రాజన్న సిరిసిల్ల జిల్లాను మాజీ సీఎం కేసీఆర్ సస్యశ్యామలంగా తీర్చిదిద్దారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఘనంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. సిరిసిల్ల పట్టణం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వేడు కలను ఘనంగా నిర్వహించారు. ముందుగా వేములవాడ దేవాలయంలో కేసీఆర్ పేరుతో ప్రత్యేక పూజలను నిర్వహించారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో రోగులకు బ్రెడ్, పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, మహిళ విభాగం పట్టణ అధ్యక్షురాలు బత్తుల వనజ, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, అర్బన్ బ్యాంక్ వైస్ చెర్మన్ ఆడగట్ల మురళి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, మాజీ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, గ్రంథాలయం జిల్లా మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య పాల్గొన్నారు.

● వేములవాడ: కేసీఆర్ జన్మదిన వేడుకలు వేములవాడలో ఘనంగా నిర్వహించారు. స్థానిక సాయిరక్ష జంక్షన్ వద్ద మొక్కలు నాటి, రాజన్న ఆలయం ముందు కేక్ కట్ చేసి పండ్ల పంపిణీ చేశారు. పార్టీ వేములవాడ నియోజకవర్గం ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు నివాసంలో పలువురు నాయకులు రక్తదానం చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, పొలాస నరేందర్, రామతీర్థపు రాజు, నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, జోగం శంకర్, సిరిగిరి రామచందర్, నరాల శేఖర్, కొండ కనకయ్య, గుడిసె సదానందం, ముద్రకోల వెంకటేశం, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

● వేములవాడ కల్చరల్: కేసీఆర్ జన్మదినం సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రాజన్నకు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. అర్బన్ మండలంలో మాజీ జడ్పీటీసీ మ్యాకల రవి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు అగ్రహారం హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామతీర్థపు రాజు, నరాల శేఖర్, మారం కుమార్ ఉన్నారు.

● ఇల్లంతకుంట: కేసీఆర్ జన్మదిన వేడుకలు మండలంలో ఘనంగా జరుపుకున్నారు. జడ్పీమాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, మండలశాఖ అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి, సెస్‌డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డి, నాయకులు రాజిరెడ్డి, ఉడుతల వెంకన్న ఉన్నారు.

● ఎల్లారెడ్డిపేట,: మండలంలోని అల్మాస్‌పూర్ గ్రామ శివారులోని కాల్వ వద్ద జలాలకు పార్టీ నాయకులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాగు నీటిలో దిగి మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే కేటీఆర్ చిత్రపటాలకు జలాలతో అభిషేకం చేశారు. అనంతరం అక్కడే మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, నాయకులు సుభాష్, రమేశ్, నర్సింహారెడ్డి, జబ్బార్, శ్రీనివాస్ ఉన్నారు.

● గంభీరావుపేట: మండల కేంద్రంతో పాటు గోరంటాల, ముస్తఫానగర్ తదితర గ్రామాల్లో కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గోరంటాల సాయిబాబా ఆలయంలో నాఫ్స్‌కాప్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి మొక్కలు నాటారు. మండల అధ్యక్షుడు పాప గారి వెంకటస్వామి, సెస్ డైరెక్టర్ నారాయణరావు, పట్టణ అధ్యక్షుడు పెద్దవేని వెంకటి, గద్యాండపు రాజు తదితరులు ఉన్నారు.

● వీర్నపల్లి: బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి గుగులోతు కళావతి, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, మాజీ జడ్పీ కో ఆప్షన్ సభ్యులు చాంద్ పాషా, బీఆర్ఎస్ పార్టీ మహిళ అధ్యక్షురాలు గుగులోతు కళ, బంజారా సంఘం జిల్లా అధ్యక్షులు సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్: బీఆర్ఎస్ పట్టణ శాఖ అధ్యక్షుడు ఎద్దండి నర్సింహరెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జనగామ శరత్‌రావు, మాజీ సెస్ డైరెక్టర్ విజయరామారావు, మాజీ కోఆప్షన్ మెంబర్ ఎండీ సర్వర్‌పాషా, చెవుల మల్లేశ్, భరత్, శీలం స్వామి పాల్గొన్నారు.

● రుద్రంగి: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయ సమీపంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు దెగవాత్ తిరుపతి, మాజీ ఎంపీపీ గంగం స్వరూపరాణి మహేష్, మాజీ వైస్ ఎంపీపీ పిసరి చిన్న భూమయ్య, మాజీ ఎంపీటీసీ లావణ్య రాజేశం పాల్గొన్నారు.

● కోనరావుపేట: మండల కేంద్రంలో పాటు సుద్దాల తదితర గ్రామాల్లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్యాల దేవ య్య, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, మాజీ ఎంపీపీ చంద్రయ్య గౌడ్, మంతెన సంతోష్, నర్సయ్య పాల్గొన్నారు.

● బోయినపల్లి : కేసీఆర్ జన్మదినం సందర్భంగా బోయినపల్లి మండలం నీలోజిపల్లి గ్రామంలో సోమవారం బీఆర్ఎస్ శ్రేణులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు అనుమల భాస్కర్ బోయినపల్లి మాజీ వైస్ ఎంపీపీ కొనకటి నాగయ్య, పెంతల బాల్‌రెడ్డి ఎర్ర శ్రీనివాస్, గూడ బాలకిషన్, చెంచు సంపత్, ఉమ్మారెడ్డి అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

● చందుర్తి: కేసీఆర్ జన్మదిన కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు, మ్యాకల ఎల్లయ్య, కేడీసీసీ డైరెక్టర్ జలగం కిషన్ రావు, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, మాజీ ఏఎంసీ చైర్మన్లు డప్పుల అశోక్, ఏనుగుల శ్రీనివాస్, చిలుక పెంటయ్య పాల్గొన్నారు.